# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 21-03-2018**

2018-19 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. ఈ విధానం అమలు చేయడం కోసం ఈ అసెంబ్లీ సమావేశంలోనే చట్టం తెస్తున్నట్లు వెల్లడించారు.

మాతృభాష బోధన అమలుకు సంబంధించిన తమిళనాడులోని విధానాన్ని అధ్యయనం చేయడానికి వెళ్లి వచ్చిన అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై రూపొందించాల్సిన విధి విధానాలపై చర్చించారు. "మాతృభాష అయిన తెలుగును రక్షించుకోవడం, మన సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లో తెలుగును సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇంగ్లీషు మీడియంలో చదవడం అందరికీ అనివార్యమవుతున్నది. పిల్లల భవిష్యత్తును కూడా దెబ్బతీయవద్దు. అదే క్రమంలో తెలుగు కనుమరుగు కావద్దు. అందుకే ఇంగ్లీషు మీడియంలో చదివే విద్యార్థులు కూడా తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధన పెడుతున్నాం. మొదట ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించాం. అయితే ఇంటర్మీడియట్ (10+2) అన్ని విద్యాసంస్థల్లో ఒకే మాదిరిగా లేదు. ఇంటర్మీడియట్ లో తెలుగును అమలు చేయడం కాస్త ఇబ్బందిగా మారుతుంది. తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో మాతృభాష బోధన అమలును పరిశీలించిన అనంతరం మొదటి దశలో పదవ తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పనిసరిగా సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం" అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

తరగతుల వారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్ రూపొందించాల్సిందిగా తెలుగు యూనివర్సిటీ, సాహిత్య అకాడమీలను ముఖ్యమంత్రి కోరారు. భాషను కాపాడుకోవడంతో పాటు, మాతృభాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశ భక్తిని పెంచే అంశాలుండాలని వివరించారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసకుంటుంది. ప్రైవేటు పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను సీఎం ఆదేశించారు.

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి, మంత్రులు శ్రీ కెటి రామారావు, శ్రీ జూపల్లి కృష్ణారావు, శ్రీ పద్మారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు శ్రీ రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ రాజీవ్ రంజన్ ఆచార్య, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యా డైరెక్టర్ శ్రీ జి. కిషన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు శ్రీ నందిని సిధారెడ్డి, కార్యదర్శి శ్రీ ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీ ఎస్.వి. సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ నర్సింగ్ రావు, ఎస్.ఇ.ఆర్.టి. అధికారి శ్రీమతి సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**